# ఆశ్రయం దొరికింది

విన్నకోట సుశీలాదేవి

క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ



**త**న చేతిలో పెడ్తున్న డబ్బుని చూసి ఆశ్చర్యంగా తలెత్తి– "లాయర్‌గారూ! ఏమిటిది? ఇంత తక్కువ ఇస్తున్నారు?" అనడిగింది జానకి.

'ఇంకా నయమమ్మా! నేను గట్టిగా అడగబట్టి ఇదన్నా ఇచ్చాడమ్మా! చాలా గొడవ పెట్టుకున్నాడులే!" అన్నారు లాయరుగారు.

"ఎందుకు?"

"ఏం చెప్పమంటావమ్మా ఈ మధ్య నీ ప్రవర్తన బాగాలేదట! ఎవరితోనో తిరుగుతున్నావని అతడు ఆరోపిస్తున్నాడు!"

"నేనా?" జానకి రక్తం ఉడికిపోయింది. సిగ్గుతో అవమానంతో ముఖం కందగడ్డ అయింది.

"అవునమ్మా! ఒక్కమాటకాదు నాలిక్కి నరం లేదన్నట్లు ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడు" అంటూ అతనేమన్నాడో చెప్పుకొచ్చారు లాయరుగారు

జానకి వినలేకపోయింది.

ఆ మాటలు వింటుంటే గుండెల్లోంచి ఏడుపు ఉప్పెనలా రాసాగింది జానక్కి! కాని అది పదిమంది తిరిగే కోర్టని ఆపుకుంది.

"మీరు .... నమ్మారా సార్!"

"నమ్మలేదు కాబట్టే ఎంతో వాదించాను. కాని అతడు సాక్ష్యాధారాలు చూపిస్తున్నాడు. మేజిస్ట్రేట్ కూడా వాడి మాటలే నమ్మినట్లు కనబడుతున్నాడు. నేను గట్టిగా మాట్లాడబట్టి ఇదయినా ఇచ్చాడమ్మా".

క్షణం ఆగి "అమ్మాయ్ నువ్వు కొంచెం జాగ్రత్తగా వుండాలమ్మా. వయసు చెడ్డది... నాకు తెలుసు కాని ఇలా అయితే నీకు ముందు ముందు భరణం వచ్చే అవకాశం లేదమ్మా! ఆలోచించుకో? అప్పుడు నేను కూడా ఏం చేయలేను" అంటూ వెళ్లిపోయాడు లాయరు.

జానకి శిలలా కూర్చుండిపోయింది.

మనస్సు ద్వంద్వాతీతమైంది. భూమి బ్రద్దలై తనని దాచేసుకుంటే బాగుండు నన్పించసాగింది. అలా ఎంత సేపున్నదో....

"అమ్మా! నాన్న అరుగో...." ప్రక్కన కూర్చున్న కూతురు దివ్య అరిచింది. తల్లి చేతిని కుదుపుతూ...

జానకి ఈ లోకంలోకి వచ్చింది.

కూతురు చెప్పిన వైపు చూసింది.

కొద్ది దూరంలో భాస్కర్ స్కూటర్ స్టార్టు చేస్తూ కన్పించాడు.

"అమ్మా! నాన్న దగ్గరకు వెడదాం!" ఆశగా అడుగుతున్న కూతుర్ని కసురుకుంది.

"నోర్మూసుకుని కూర్చో!" తన బాధని కూతురు మీద కోపంగా మార్చింది.

భాస్కర్ స్కూటర్ మీద కూర్చుని బయలుదేరుతూ జానకి వేపు చూసి వెటకారంగా నవ్వుతూ వెళ్ళిపోయాడు. అతని వైపే కోపంగా చూస్తున్న జానకికి ఆ నవ్వు పుండు మీద కారం చల్లినట్లయి ముఖం తిప్పుకుంది! ఉక్రోషంతో కన్నీళ్ళు వచ్చాయి.

భాస్కర్ వెళ్ళిపోయాడు.

జానకి కూతుర్ని తీసుకుని ఇంటికి బయలుదేరింది.

ప్రొద్దున్నెప్పుడో తాగిన గుక్కెడు 'టీ' నీళ్లు. ఆకలితో నీరసం వస్తోంది. ఒళ్ళు తూలుతోంది.

చేతిలో డబ్బుంది. ఏవన్నా తినాలని వుంది. కాని ప్రతినెలా ఇచ్చే ఎనిమిది వందలు తామిద్దరికీ నెలలో ఒక్కపూటే భోజనం పెడతాయి. ఈనెల మరీ తగ్గిపోయాయి. చేతిలో వున్నవి ఆయిదొందలు. ఏ బాకీ తీర్చాలి. దేన్ని ఆపాలి. నెలంతా ఎలా బతకాలి. బుర్ర తిరిగిపోతోంది.

''అమ్మా! ఆకలవుతోందీ!'' దివ్య అడిగింది. కూతురుకి కూడా ప్రొద్దుటి నుండి ఏం పెట్టలేదు.

డబ్బు వస్తే ఏవన్నా కొనివ్వచ్చనుకుంది. కాని పరిస్థితి తారుమారయింది.

'ముందు ఏవన్నా తినాలి తప్పదు. లేకపోతే ఇంటికెళ్ళే ఓపిక్కూడా వుండదు కదా!

"అమ్మా! ఆకలవుతోందే..." అంది దివ్య తల్లి చేయి పట్టుకుని. కోర్టులో వున్న క్యాంటీన్‌లో ఇద్దరూ ఇడ్లీ తిన్నారు. కొంచెం శక్తి వచ్చి నట్లయింది.

"అమ్మా! నాన్న మన దగ్గరికి రాకుండా వెళ్ళిపోయాడే!" క్యాంటిన్ నుండి బయటి కొచ్చాక... నడుస్తుండగా అంది దివ్య.

''వాడు నాన్న కాడమ్మా. మీనాన్న చచ్చిపోయాడు. వాడు నాన్న రూపంలో వున్న మోసగాడు- దొంగ...'' అంది జానకి కసిగా.

దివ్య తల్లివైపు ఆశ్చర్యంగా చూసింది!

☆ ☆ ☆

బస్సెక్కి ఇంటికొచ్చేసరికి రెండు దాటింది. కాళ్లూ - చేతులూ కడుక్కొని కంచాలు పెట్టింది జానకి. కూతురు కంచంలో అన్నం పెట్టి చింతకాయ పచ్చడి వేసింది. తనూ పెట్టుకుంది.

"అమ్మా! డబ్బులొచ్చాయిగా రేపైనా కూర చేయమ్మా!"

అంది కూతురు పచ్చడిలో అన్నం కలుపు కుంటూ! ఆ మాట గుండెకి సూటిగా తాకి విలవిలలాడింది జానకి.

"అలాగే తల్లీ"

పచ్చడి కలుపుకుని నోట్లో ముద్ద పెట్టుకో బోయింది.

"నేనిచ్చే డబ్బుతో ముప్పొద్దులా మెక్కుతూ కొవ్వెక్కి తిరిగే ఆ మనిషికి ఇకపై నేను భరణం ఇవ్వను" అంటున్నాడమ్మా భాస్కర్!

ప్లీడరుగారు అన్న మాటలు గుర్తుకొచ్చి కన్నీళ్లు జలజలా రాలి కంచంలో పడ్డాయి. అన్నం తినలేకపోయింది.

కంచంలో చెయ్యి కడుక్కుంది.

"అమ్మా! ఎందుకే అన్నం తినకుండా చెయ్యి కడిగేశావ్"

"తినాలని లేదు...నువ్వు తిని... కూర్చుని చదువుకో!"

అని గదిలో ఒక ప్రక్కగా చాప వేసుకుని పడుకుంది.

భాస్కర్ అన్నమాటలు తలుచుకుంటుంటే గుండెల్లోంచి దుఃఖం ఉప్పెనలా వస్తోంది.

తన బ్రతుకిలా ఎందుకైంది? తను అందరిలా తన జీవితాన్ని గురించి ఎన్నో కలలు కన్నది! మంచి భర్తా.. చక్కని పిల్లలతో హాయిగా జీవించాలనుకుంది! కాని చివరికిలా అయింది.

కన్న తల్లిదండ్రులకూ తను బరువై పోయింది. కట్టుకున్న భర్తకూ తను అక్కర్లేక పోయింది... ఎవ్వరికీ కాని బ్రతుకైంది.

అందరూ వదిలిపెట్టారు. తనూ... తన కూతురు... ఒకరి కొకరు ఆధారం. తామిద్దరికీ భర్త ఇచ్చే భరణమే ఆధారం. నెలకు అతడిచ్చే ఎనిమిదొందలు తమకేమాత్రం చాలవు.

తనుండే ఈ రేకుల షెడ్డుకు అద్దె మూడొందలు. కూతురు చదువు-ఇతర ఖర్చులకు అయిదొందల్లోనే సర్దుకోవాలి. ఇది కూడా ఇవ్వడం ఇష్టంలేక తన మీద లేనిపోని నిందలు వేస్తున్నాడు.

తన పరిస్థితి తనకే అసహ్యం గొలుపు తోంది. ఏం చెయ్యాలి. తనకే కనుక చదువుంటే తన కాళ్ల మీద తాను నిలబడేది. చదువుకునే రోజుల్లో అనుకునేది బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేయాలని... కాని ఇంటర్ చదువు తుండగానే సంబంధాలు చూడటం మొద లెట్టారు. అది తెలిసి కంగారుపడుతూ తల్లికి తన అభిప్రాయం చెప్పాలనుకుంది.

"అమ్మా! నేను డిగ్రీ పూర్తి చేసే వరకూ పెళ్లి చేసుకోను!" దానికి తల్లి ఇంతెత్తున లేచింది.

"అంతేనా! ఇంకా చదువుతావా! అసలు టెన్త్ అయిన వెంటనే చేద్దామనుకున్నాం. సంబంధం కుదరక పోవడంతో ఇంటర్‌లో చేర్పించాం. ఇప్పుడు సంబంధం వచ్చింది. నోర్మూసుకుని చేసుకో! చదివింది చాలు. ఎప్పుడెప్పుడు మా గుండెల మీది భారం దింపుకుందామా అని మేము ఆరాటపడ్తున్నాం!"

ఇంక తనేమీ నోరెత్తలేకపోయింది.

ఇంటర్ పరీక్షలు కూడా రాయనివ్వ కుండానే మాఘమాసంలో భాస్కర్‌తో పెళ్లయింది. భాస్కర్ ఎమ్మే పాసయ్యాడు కాని ఎక్కడా ఉద్యోగం రాక ఒక చిన్న కాన్వెంటులో టీచరుగా పనిచేస్తున్నాడు... తక్కువ కట్నంలో సంబంధం దొరికిందని సంతోషించాడు తన తండ్రి. ఆయన ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు ఆయనకు ముగ్గురు పిల్లలు. ఇద్దరు కూతుళ్ళు! ఒక కొడుకు. తనే పెద్దది. పెళ్లయిన ఆరు నెలలకు భాస్కర్‌కి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. 'అంతా జానకి అదృష్టమని' పొగిడారు.

తను కూడా సంతోషంతో పొంగి పోయింది. ప్రైవేటుగా చదివి ఇంటరు పూర్తి చేయవచ్చని ఆశించింది.

కాని భాస్కర్‌కి మంచిఉద్యోగం వచ్చిందన్న ఆనందం ఎక్కువ రోజులు నిలవలేదు తనకు... క్రమంగా భాస్కర్‌లో మార్పు రాసాగింది. డబ్బు మీద వ్యామోహం పెరిగింది. అదే సమయంలో భాస్కర్ తోటి లెక్చరర్‌కు అయిదు లక్షల కట్నంతో పెళ్లయిందని తెలిసినప్పట్నించీ భాస్కర్‌కు బాధ మరింత ఎక్కువైంది. అయిదు లక్షలంటే మాటలా, క్షణాల్లో లక్షాధికారయ్యాడు అనుకున్నాడు. తొందర పడి పెళ్లి చేసుకున్నాడు. వాళ్ళు ఇచ్చింది ముష్టి పాతికవేలు.... తనిప్పుడు చేసుకుంటే తనకూ అయిదు లక్షలొచ్చేవి. తేలిగ్గా లక్షాధికారయ్యేవాడు. ఎంత పోగొట్టుకున్నాడు' ఈ ఆలోచనల్తో భాస్కర్‌కి పిచ్చిపట్టినట్లయింది.

అతడు కోపాన్ని తన మీద చూపాడు.

"నేనిప్పుడు లెక్చరర్ని. నా ఖరీదెంతో తెలుసా అయిదు లక్షలు. పైగా అందగాడిని కాబట్టి ఇంకో లక్ష ఎక్కువ వస్తుంది. సరే! ఏదో మన పెళ్లయిపోయింది కాబట్టి మీ నాన్ననడిగి కనీసం మూడు లక్షలు పట్టుకురా!" అంటూ

తనని పీడించసాగాడు.

తను వెళ్ళి ఏడ్చి బాధపడితే.. అతి కష్టం మీద తండ్రి ఇరవై వేలు సర్దాడు. ఇచ్చి ఇక పైసా కూడా ఇవ్వలేనన్నాడు.

ఆ డబ్బుతో కొద్దిరోజులు సంతోషించాడు భాస్కర్. మళ్లీ తిరిగి తనని డబ్బుకోసం వేధించ సాగాడు. తండ్రి ఇవ్వలేదని తెలుసు... అందుకే అతడు పెట్టే బాధల్ని మౌనంగా భరించసాగింది! ఇంతలో తను గర్భవతి కావడం ఆడపిల్ల పుట్టడం జరిగింది. అది భాస్కర్‌కి మరింత కోపహేతువైంది.

ఇప్పుడు భాస్కర్ ఆలోచనలు కొత్తదారి తొక్కాయి.

"జానకి తండ్రి ఇక తనకేమీ ఇవ్వలేదు. డబ్బు కావాలంటే జానకిని వదల్చుకోవాలి. అప్పుడు మరొక పెళ్లి చేసుకోవచ్చు. తేలిగ్గా లక్షలు ఆర్జించవచ్చు" అని.

అదే ఒక రోజు తనతో చెప్పాడు.

"జానకీ! నీకు విడాకులివ్వాలనుకుంటు న్నాను. ఈ కాగితాలపై సంతకం పెట్టు"అన్నాడు.

అనుకోని పిడుగుపాటుకు తను స్తబ్దు రాలైంది. నోట మాటరాలేదు. భాస్కర్ ఇటువంటి నిర్ణయానికొస్తాడనుకోలేదు. కొన్నాళ్లు తనని బాధించి ఇక విసిగి తనే ఊరుకుంటా డనుకుంది. కాని ఏకంగా విడాకులకే సిద్ధ పడ్డాడు. ఇప్పుడేం చేయాలి?

"సంతకం పెట్టు" చేయి పట్టుకుని లాగి బలవంతంగా పెట్టించబోయాడు. పెన్ను విసిరికొట్టింది. భాస్కర్ కోపంతో బాదేశాడు.

తను ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయింది.

మర్నాటి నుండే హింస మరింత ఎక్కు వైంది. భరించలేక తల్లిదండ్రుల్ని పిలిపించింది. వాళ్లు భాస్కర్‌ని బ్రతిమిలాడారు. వినలేదు. ఏం చేయాలో వాళ్లకూ తోచలేదు. అశక్తులయ్యారు.

"మేమేమీ చెయ్యలేం. పెళ్ళి చేసేవరకే మా బాధ్యత. నీ కాపురాన్ని నువ్వే దిద్దుకో!" అని వెళ్లిపోయారు.

తనని అడ్డుకునేవారెవ్వరూ లేకపోవడంతో భాస్కర్ మరీ రెచ్చిపోయాడు.

'నువ్వు సంతకం పెడ్తావా! లేక నా చేతుల్లో చస్తావా!" అన్నాడు మొండిగా.

తనకర్థమైంది. ఇక తననెవరూ రక్షించ లేరని. తను చనిపోతే తన కూతురు ఒంటరిదవు తుంది. దాన్ని కూడా చంపేస్తారు. లేకపోతే ఎవరికో అమ్మేస్తారు. కూతురి కోసమైనా బ్రతకాలి. తను చచ్చిపోయాక అతడు మరొక పెళ్లి చేసుకొని హాయిగా బ్రతుకుతాడు. అతని సుఖం కోసం తను చావాలా? అకారణంగా అతని చేతుల్లో చనిపోవడం ఇష్టం లేక పోయింది... అందుకే అతడు పెట్టమన్న చోట సంతకం పెట్టింది.

విడాకులొచ్చాయి..!

ఆదరించేవారు లేరు. చేతిలో పైసాలేదు. మూడేళ్ల కూతురితో కట్టుబట్టలతో నడిరోడ్డు మీద నిలబడింది. నీళ్లలో నుండి బయటపడిన చేపలాగా ఉక్కిరిబిక్కిరవుతుంటే లాయరు గారు దయతలచి భరణం వచ్చేలా ఏర్పాటు చేశారు.

ఎలాగో బతికేస్తోంది.

దాదాపుగా సంవత్సరంనుండిఇస్తున్నాడు. ఇప్పుడు అది కూడా ఇవ్వకుండా తప్పించు కోవాలని చూస్తున్నాడు.

అయినా తనకు బుద్ధిలేదు.

తను అక్కర్లేదని వదిలిపెట్టిన వాడు- బాధపడుతూ పడేసే ముష్టి కోసమని చేతులు చాస్తోంది. వాడు విదిల్చే ఎంగిలి మెతుకుల కోసం ప్రతి నెలా ఎదురుచూస్తుంది. తన దెంత అధ్వాన్న బ్రతుకైంది...

తనకు సిగ్గులేదు... అవమానం లేదు...

రెండ్రోజుల క్రితం కొత్త భార్య, కొడుకుతో స్కూటర్ మీద ఆనందంగా తన వీధిలో నుండే వెడుతున్నాడు. బహుశ వాళ్ళను తనకు చూపెట్టి తనని బాధించాలని అతని ఉద్దేశమేమో..

"అమ్మా! నాన్న వెళ్లిపోతున్నాడమ్మా! పిలువమ్మా!" పాప ఏడుపు గుండెల్ని కోసింది.

ఇటువంటి పరిస్థితి శత్రువులకు కూడా రాకూడదనుకుంది.

ఇవ్వాళ కోర్టులో అందరి ముందు తన గురించి ఏవేవో మాట్లాడి తననెంతో అవమా నించాడు. ఛీ! ఇక వాడిముఖం చూడకూడదు...

వాడిచ్చే భరణం తీసుకోకూడదు.

అంతకంటే ముష్టెత్తుకుని జీవించినా ఆనందమే...

ఇప్పటికైనా కళ్ళు తెరుచుకున్నాయి... చావనైనా చస్తుంది కాని.. వాడి ముందు చేయి చాపదు!

కోర్టులో అందరి ముందూ ఎంత అసహ్యంగా మాట్లాడి వుంటాడో.

"అమ్మాయ్. నువ్వెవరితోనో నవ్వుతూ మాట్లాడుతున్నావుట... అతడెవరో ఈ మధ్య తరుచు మీ ఇంటికొస్తున్నాట్ట!"

లాయరుగారి మాటలు గుర్తుకొచ్చి శరీరం భగభగలాడింది... అనాథ అయిన ఆడదాని బ్రతుకు ఎంత చులకన అయిపోయింది? మగవాడితో మాట్లాడితేనే చాలు రంకు కట్టే మనుషులున్న ఈ లోకంలో తను చేస్తోంది తప్పే! ఆనాటి సీతకే తప్పలేదు అగ్ని ప్రవేశం..."

"ఏదో పేరు చెప్పాడమ్మా! ఆ .... రాఘవ.. ఎవరమ్మా అతను?" పేరు కూడా కనుక్కున్నాడన్నమాట! విడాకులు ఇచ్చాక తన మీద శ్రద్ధ ఎక్కువైంది.

"అమ్మా! రాఘవంకుల్ వచ్చాడమ్మా!"

ఆలోచన్ల నుండి బయటపడి జానకి లేచి ముఖం తుడుచుకుని వచ్చింది.

"ఏంటమ్మగారూ! అలా ఉన్నారు?" అనడిగాడు రాఘవ జానకిని.


**పుస్తకావిష్కరణ వేదిక**

**విజయవాడలో పుస్తకావిష్కరణ అభిలషించే రచయితలకు ఆహ్వానం**

'చినుకు-శ్రీ వాగ్దేవి' సంయుక్తంగా ప్రగతిశీలసాహిత్యగ్రంథాల ఆవిష్కరణోత్సవానికి సహకారాన్ని అందిస్తున్నాయని తెలియచేస్తున్నాం.

ఉత్సాహం ఉన్న రచయితలు చినుకు సంపాదకవర్గాన్ని సంప్రదించండి

"ఏంలేదు! కొద్దిగా తలనొప్పిగా వుంది?"

'ఇంటికెడుతూ వచ్చానమ్మా! పాపకెలా ఉందోనని?' అంటూ దివ్యని పిలిచి చాక్లెట్లు ఇచ్చి దగ్గరకు తీసుకున్నాడు.

దివ్య అతని ఒళ్ళో కూర్చుని కబుర్లు చెప్పసాగింది.

"ఇవ్వాళ నాన్న కనబడ్డాడు. మరే అంకుల్! నాతోనూ-అమ్మతోనూ అస్సలు మాట్లాడలా!" దివ్య చెప్తోంది.

"దివ్యా నోర్మూసుకో!" కసిరింది జానకి.

"కోర్టు కెళ్ళారా అమ్మా!" అనడిగాడు.

'అవును'! ముఖం తిప్పుకుని ముక్తసరిగా జవాబిచ్చింది.

"నేనిక వెడతానమ్మా! పాపా! రేపొస్తాను - మళ్ళీ" అంటూ వెళ్ళిపోయాడు రాఘవ..

దివ్య రాఘవ ఇచ్చిన చాక్లెట్లు తీసుకుని బయటికెళ్లింది.

జానకి నేలపై కూలబడి తలపట్టుకు కూర్చుంది!

☆ ☆ ☆

రాఘవ - ఆ వీధి మొదట్లో 'టీ'స్టాల్ పెట్టిన రోజు అందరూ అతడిని తిట్టుకున్నారు.

ఒకరోజు ఇంటావిడ జానకిని పిలిచి

"చూడమ్మా జానకీ! రోజులెలా మారిపోయాయో" అంది బుగ్గలు నొక్కుకుంటూ.

జానకి ఆశ్చర్యపోతూ "ఏమైందండీ" అనడిగింది. "నీకింకా తెలీదా! ఈ వీధి మొదట్లో 'టీ' స్టాల్ పెట్టిన వాడెవడో తెలుసా! అబ్బో పెద్ద రౌడీలే. అంతే కాదు. దొంగతనం కేసుల్లో జైలుక్కూడా వెళ్లాడమ్మా" రహస్యం చెప్తున్నట్లు మెల్లగా అంది.

జానకి తెల్లబోయింది.

"నువ్వసలే ఒంటరిగా వుంటున్నావ్! జాగ్రత్తమ్మా" అందావిడ.

ఆవిడ మాటలకు నవ్వుకుంది జానకి! తన బ్రతుకు తన చేతుల్లోంచి జారిపోయి చాలా కాలమైంది.

ఆవిడ మాటలు విని నిర్లిప్తంగా ఊరుకుంది.

ఒకరోజు సాయంత్రం నాల్గు గంటలకు తన ఇంటి రేకు తలుపుల్ని ఎవరో దబదబా బాదుతుంటే తలుపు తీసింది జానకి.

ఎదురుగా ఎవరో వ్యక్తి - అతని చేతుల్లో తన కూతురు రక్తసిక్తమైన శరీరంతో...

జానకి కెవ్వున కేక వేసింది. తూలిపడబోయింది.. తెప్పరిల్లి....

"ఏవయింది నా కూతురికి!" ఆందోళనగా అడిగింది.... 'మీరేం కంగారుపడకండి.. పాప స్కూలు నుండి వస్తోంటే స్కూటర్ గుద్దేసిందండి. స్కూటరతను సడన్‌బ్రేక్ వేయబట్టి సరిపోయింది. పెద్ద దెబ్బలేం తగల్లేదు లెండి.... కాళ్లు చేతులు గీరుకుపోయాయి. నేను ఆటో తీసుకొస్తాను. డాక్టరు దగ్గరకు వెడదాం!' అంటూ దివ్యని జానక్కి అప్పజెప్పి క్షణాల్లో ఆటో తెచ్చాడు. డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాడు.

'ప్రమాదం లేదని' మందులు రాసిచ్చాడు డాక్టరు.

'ఇవి తప్పకుండా వాడాలి. లేకపోతే సెప్టిక్ అవుతుందన్నాడు. జానకి వెర్రిగా చూసింది. తన దగ్గర డబ్బుల్లేవు. మందులు కొనడం ఎలా? ఆందోళన చెందింది. ఆమె భావం గ్రహించిన వాడిలా -

"ఆ స్కూటర్ వాలాని ఖర్చులకు డబ్బడిగానమ్మా! ఇదుగో అయిదు వందలిచ్చాడు" అంటూ జానక్కి డబ్బిచ్చాడు.

ఇంటి కొచ్చారు.

"వెడతానమ్మా! పాప జాగ్రత్తమ్మా!" అన్నాడతను.

"ఇంతకీ మీరెవరు?" అనడిగింది జానకి

"నా పేరు రాఘవ. ఈ వీధి మొదట్లోని 'టీ' స్టాల్ నాదే!" అన్నాడతను.

'ఆ' అంటూ నోరు తెరిచింది జానకి! ఆమె ఆశ్చర్యం నుండి తేరుకునే లోపల అతడు వెళ్లిపోయాడు!

మర్నాడు వచ్చాడు పళ్లు తీసుకుని. అతడిని చూడగానే ఇంటావిడ మాటలు గుర్తుకొచ్చి భయం వేసింది జానక్కి. మూలకి ఒదిగి నిల్చుంది.

"పాపకెలా వుందండి"! అనడిగాడు.

'బాగానే వుందండి!' కంగారు దాచుకుంటూ అంది.

'మందులు వేస్తున్నారా! ఇంకేమైనా డబ్బు కావాలా?'

'మందులు వేస్తున్నా, డబ్బక్కర్లేదు!' పొడిగా అంది.

దివ్యని పలకరించి వెళ్లిపోయాడు...

మళ్లీ నాల్గు రోజుల తర్వాత వచ్చాడు...

"పాపకి బాగానే వుంది!" అతడు లోపలికి రాకుండానే అంది"

"మీరు నన్ను చూసి భయపడుతున్నట్లుంది" నవ్వేడు.

"అబ్బే!లేదు... లేదు!" కంగారుగా అంది.

"నేను దుర్మార్గుడిని కానమ్మా! నేనూ మనిషినే. నిన్న నేను వచ్చాను! పాపని ఒక్కదాన్నీ ఉంచి కోర్టుకు వెళ్ళారుట కదా! డబ్బు తెచ్చుకోడానికని, పాప చెప్పింది" అన్నాడు. లోపలికొచ్చి స్టూలు మీద కూర్చుంటూ.

జానకి ముఖం కోపంతో ఎర్రబడింది.

'అమ్మా! బాధపడకండి. ఒక్కొక్కళ్ల జీవితాలు ఒకొక్క విధంగా వుంటాయి. మన చేతుల్లో ఏం లేదు. మీ గురించి నా కంతా తెలుసు. నా జీవితం గురించి కూడా మీకు తెలిస్తే...మనం విధి చేతుల్లో కీలుబొమ్మలమని అర్థమవుతుందమ్మా! నా కథ మరొకసారి చెప్తాను!" అన్నాడు.

కొద్దిసేపు పాపతో కబుర్లు చెప్పి వెళ్ళిపోయాడు. జానకికి అతడంటే భయం తగ్గింది. మనిషి ఎప్పుడూ నవ్వుతూ సౌమ్యంగా వుంటాడు... ముఖంలో కరుకుదనం లేదు.... చాలా మంచివాడిలా వున్నాడు. ఇతడు రౌడీ! దొంగ అంటే నమ్మలేకపోయింది. చుట్టుప్రక్కల వాళ్లనుకునేంత దుష్టుడు కాదు అని అనుకోగానే అతని మీద సదభిప్రాయం ఏర్పడసాగింది జానకికి. ఆ తర్వాత అతని జీవితం గురించి తెలిశాక ఆ అభిప్రాయం బలపడింది. ఒకరోజు రాఘవ తన గురించి చెప్పుకొచ్చాడు.

"చిన్నప్పుడే అమ్మా - అయ్యా పోతే మామ్మ పెంచింది నన్ను సరైన అదుపు లేకపోవడంతో చదువబ్బలేదు. అల్లరిగా తిరిగాను. దొంగతనాలు చేశాను. జైలు కెళ్లాను. రెండు నెలల క్రితం జైలు నుండి వచ్చాను. ఇంటి కెళ్లేసరికి మామ్మ చనిపోయిందని తెలిసింది. ఎందుకో చాలా బాధ కలిగింది.

ఈ ప్రపంచంలో నా కెవ్వెరూలేరు నేను ఒంటరిని అనుకోగానే దుఃఖం వచ్చింది.మామ్మ చూపిన ప్రేమ-అభిమానం గుర్తుకొచ్చి ఏడ్చాను. అక్కడే రెండ్రోజులున్నాను. మామ్మ ఒక డాక్టరు గారింట్లో పనిచేసేది! నేను వచ్చానని తెలిసి ఆయన నన్ను పిలిపించాడు. వెళ్లాను. 'మీ మామ్మ మాఇంట్లో పదేళ్లు చేసింది. ఒక్క పైసా జీతం తీసుకోలేదు. ఆ డబ్బంతా నా దగ్గరే దాచుకొంది. తను పోతే ఆ డబ్బు నీకివ్వ మంది... ఆమె దాచుకున్నది సుమారు అయిదు వేలయింది. ఇంకో అయిదు వేలు కలిపి మొత్తం పదివేలిస్తున్నా తీసుకో! రాఘవా! మీ మామ్మ ఎప్పుడూ అనుకునేది తన మనమడు మంచివాడై నలుగురిలో తలెత్తుకుని తిరగాలని! ఆవిడ బ్రతికుండగా ఆ కోరిక తీరలేదు, ఇప్పటికైనా చెడు తిరుగుళ్లు మానుకో. మంచి వాడిగా జీవించు. కష్టపడి పనిచెయ్. మీ మామ్మ కోరిక తీర్చు!" అంటూ డాక్టరుగారు పదివేలు చేతిలో పెట్టాడమ్మగారూ! మామ్మని తలుచుకుని ఏడ్చాను. ఆవిడ నా కోసం పడిన తపన-చేసిన త్యాగం - చూపిన అనురాగానికి చలించి పోయాను.. ఆవిడ కోర్కె తీర్చాలనుకున్నాను. ఈ వీధిలో టీ కొట్టు ప్రారంభించాను.. డాక్టరు గారే మొదటి బోణీ! మొన్న పాపని తీసుకెళ్లిన డాక్టరుగారేనమ్మా! చాలా మంచివారు.స్వతంత్ర జీవనం చేస్తున్నందుకు సంతోషించారు. ఏ సహాయం కావాలన్నా చేస్తానన్నారు. కొత్తలో కొంచెం ఇబ్బంది పడ్డాను కానీ అమ్మా! ఇప్పుడు ఫర్వాలేదు. మొదట్లో ఎవ్వరూ వచ్చేవారు కాదు! ఇప్పుడు బాగుంది వ్యాపారం. కానీ అమ్మా కష్టపడి సంపా దించడంలోనే ఎంతో తృప్తి - ఆనందం వున్నా యని తెలుసుకున్నాను. నా పాత జీవితాన్ని నేను మర్చిపోయినా లోకం అప్పుడప్పుడూ గుర్తు చేస్తుంది కాని పట్టించు కోనమ్మా! ఇప్పుడు నా కాళ్ల మీద నేను నిల బడ్డాను. ఒకరిని దోచుకుని తినేకంటే స్వశక్తితో సంపాదించుకున్న రూపాయైనా ఎంతో ఆనందా న్నిస్తుందని గ్రహించుకోగలిగాను. ఒకరిపై ఆధారపడకుండా బతకడం లోనే ఎంతో సుఖం ఉందమ్మా!"

రాఘవ చెప్తున్నాడు.

జానకి రాఘవ వైపు ఆశ్చర్యంగా చూడసాగింది. చుట్టు పక్కల వాళ్ళు చెప్పిన మాటలు వినడం వలన రాఘవపై దురభి ప్రాయాన్ని ఏర్పరచుకుంది. అతడంటే భయం - బెరుకు వుండేవి. దొంగ - రౌడీ అనే తేలిక భావం వుండేది. పాప నెపంతో తనింటికి వస్తున్నాడేమో! మనసులో ఏ దురుద్దేశముందో అనుకునేది. ఇప్పుడతని జీవిత గాథ తన కళ్లు తెరిపించినట్లయింది. అతడు తనకి జ్ఞానబోధ చేస్తున్నట్లుంది. లోకం గురించిన మంచి-చెడులు అర్థమవుతున్నాయి. కొత్త లోకాల ద్వారాలు విచ్చుకున్నట్లుగా వుంది!

☆ ☆ ☆

వారం తర్వాత

జానకి వీధి మొదట్లో వున్న అతని 'టీ' స్టాల్ దగ్గరికెళ్లింది తొలిసారిగా చిన్న రేకుల షెడ్డు! పరిశుభ్రంగా ఉంది. గ్యాస్ పొయ్యి మీద ఒక ప్రక్క పాలు- మరో ప్రక్కన 'టీ డికాక్షన్ మరుగుతున్నాయి' ఒక ప్రక్కబల్ల మీద గ్లాసులు బోర్లించి వున్నాయి.

బయట మూడు బెంచీలు వేసి వున్నాయి. ఎవరో ఇద్దరుకూర్చుని 'టీ'త్రాగుతున్నారు.

జానకి ఆ సమయంలో వెళ్లింది.

జానకిని చూసి ఆశ్చర్యపోతూ "ఏమైం దమ్మా! పాప కెలా వుంది!....

ఏవన్నా సమస్య వచ్చిందా!" కంగారుగా, అడిగాడు రాఘవ.

"అంతా బాగానే వుంది. నీ 'టీ' స్టాలు చూడాలని వచ్చాను!" అంది జానకి. స్టూలు వేశాడు. "కూర్చోండమ్మా!"

జానకి కూర్చుంది.

"ఏం చూస్తారమ్మా ఇదేం పెద్ద హోటలు కాదు. చిన్న రేకుల షెడ్డు" నవ్వేసి 'టీ' తాగు తారా!" అనడిగాడు.

"ఆ" అంది జానకి.

గ్లాసు శుభ్రంగా కడిగి 'టీ' కలిపి ఇచ్చాడు.

"అన్నీ నువ్వే చేసుకుంటున్నావ్! పని వాళ్లెవరూ లేరా?" అనడిగింది.

"మొదట్లో అవసరం లేకపోయిందమ్మా! ఈ మధ్య జనం బాగానే వస్తున్నారు. అందుకనే ఎవరినైనా పెట్టుకోవాలనుకుంటున్నాను!" అన్నాడు.

జానకి హఠాత్తుగా "నన్ను పెట్టు కుంటావా?" అనడిగింది.

రాఘవ నివ్వెరపోయాడు.

"మీరు... నా దగ్గర పని చేస్తారా?"

"అవును రాఘవా? నాకేం జీతం అక్కర్లేదు. నాకూ - నా కూతురికీ రెండు పూటలా అన్నం పెడితే చాలు. నేను 'టీ'చాలా బాగా పెడతాను. అంతే కాదు నాకు రకరకాల ఫలహారాలు చెయ్యడం కూడా వచ్చు! నాకు పని ఇస్తావా!" అనడిగింది.

"అంతకంటేనా అమ్మా... కాని!" సంకో చిస్తూ ఆగాడు.

"ఏమిటో చెప్పు?"

"నేను మంచివాడిని కాదంటోంది లోకం. నా దగ్గర పని చేస్తే... మీరెన్ని బాధలు పడాలో?" అని!

"మంచి చెడ్డలు నాకు తెలుసు.... అంతే కాదు రాఘవా! నేనెవ్వరికీ భయపడను!" దృఢంగా అంది జానకి!

"సరేనమ్మగారూ... మీ ఇష్టం!".

"అమ్మగారూ కాదు... రాఘవా! జానకి అని పిలు. ఎందుకంటే నువ్వు యజమానివి నేను నీ కింద పనిచేసేదాన్ని కదా!" నవ్వింది జానకి.

"కాని... అమ్మా!"

"అదుగో మళ్లా! జానకి అనాలి!" అని చెప్పానా?

రాఘవ నవ్వేస్తూ "అలాగే జానకీ!" అన్నాడు.

తుఫానులో కొట్టుకుపోతున్న లేడి పిల్లకు వెచ్చని ఆశ్రయం దొరికినట్లు తృప్తిపడింది జానకి!

## విజ్ఞప్తి

చినుకు నచ్చితే చందా కట్టి
మీ మిత్రులకు
కానుకగా ఇవ్వండి